



దేశాభివృద్ధిలో ఐఐటీ విద్యార్థులు కీలకం

- కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్
- ఐఐటీ హైదరాబాద్ సందర్శన

7

నేడు సంగారెడ్డి రామ్‌మందిర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి

జగ్గారెడ్డి కూతురు నిశ్చితార్థానికి హాజరవుతున్న సీఎం, టీపీసీసీ చీఫ్ మహేశ్, కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి, రాష్ట్ర మంత్రులు, ప్రముఖులు

సంగారెడ్డి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి రాంనగర్ రామ్‌మందిర్ వద్ద నేడు సాయంత్రం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కూతురు జయారెడ్డి, గుణచైతన్యరెడ్డిల నిశ్చితార్థ వేడుక జరగనున్నది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డితో పాటు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు, ఇతర ప్రముఖులు హాజరవుతున్నారు. ముందుగా సీఎం రామ్‌మందిర్‌లో సీతారాములను దర్శనం చేసుకుంటారు. అనంతరం కాబోయే వధూవరులను ఆశీర్వదిస్తారు. ఈ మేరకు ఘనంగా ఏర్పాట్లు చేశారు.



పోలీసుల పహారాలో సర్వే

రెండో రోజు బైపాస్ నిర్వాసితుల ఆందోళనలు



ఓ వెంచర్‌లో సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

రామాయంపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రామాయంపేటలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి సర్వే మంగళవారం భారీ పోలీసు పహారా నడుమ కొనసాగింది. రెండో రోజూ నిర్వాసితుల ఆందోళనలతో ఘర్షణ వాతావరణం నెలకొన్నది. నేషనల్ హైవే అథారిటీ, ఆర్డీవో రమాదేవి తహసీల్దార్ రజని నేతృత్వంలో సర్వేయర్ల బృందం పోలీసుల సహాయంతో డిజిటల్ సర్వే చేశారు. ఉదయం నుంచి పలు వెంచర్ల మీదుగా వెంకటేశ్వర కాలనీ వైపుగా సర్వే జరిగింది. మరో రెండు రోజుల్లో సర్వే పూర్తయ్యే అవకాశం ఉన్నది.

మూడోరోజు ప్రశాంతంగా ఓపెన్ పరీక్షలు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ థియరీ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం జరిగిన పొలిటికల్ సైన్స్ పరీక్షకు 2,663 మంది హాజరయ్యారు. టెన్త్ మ్యాథ్స్ పరీక్షకు 1,838 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ఇంటర్ కెమిస్ట్రీ పరీక్షకు 826 మంది హాజరయ్యారు. టెన్త్ బిజినెస్ స్టడీస్ పరీక్షకు 22 మంది హాజరైనట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

అండ లేదు.. నీడ లేదు

- వదిలేసి వెళ్లిన తల్లి.. తిరిగిరాని లోకాలకు తండ్రి
- అనాథలైన ముగ్గురు చిన్నారులు
- ప్రభుత్వ హాస్టళ్లలో చదువులు
- సెలవుల్లో ఎక్కడికి వెళ్లాలనే దైన్యం

7



వేసవిలో ఆరోగ్యం పైలం

- మండుతున్న ఎండలు..
- వాటితోపాటే వ్యాధుల ముప్పు
- జాగ్రత్తలు పాటిస్తేనే మేలంటున్న వైద్యులు
- వడదెబ్బ బారిన పడొద్దు

7



అట్టడుగున..

ఇంటర్ ఫలితాల్లో మెదక్ జిల్లా వెనుకంజ

- ఫస్టియర్‌లో రాష్ట్రంలోనే చివరి స్థానం
- సెకండియర్‌లో 29 స్థానానికి పరిమితం
- ఒకేషనల్‌లో కొంత మెరుగు
- ఫలితాల్లో బాలికలదే పైచేయి



శివసాయి

మెదక్ అర్బన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో మెదక్ జిల్లా మరోసారి నిరాశపర్చింది. ప్రథమ సంవత్సరంలో రాష్ట్రంలోనే జిల్లా చివరి స్థానంలో నిలువగా.. ద్వితీయ సంవత్సరంలో 29వ స్థానానికే పరిమితమైంది. మంగళవారం విడుదలైన ఫలితాల్లో ఫస్టియర్‌లో 46.87 శాతం, సెకండ్ ఇయర్‌లో 59.4 శాతం ఉత్తీర్ణత సాధించింది. బాలుర కంటే బాలికలే మెరుగైన ఫలితాలు సాధించారు.

ఫలితాలు ఇలా...

ఇంటర్ ఫస్టియర్ జనరల్ విభాగంలో మొత్తం 5,519 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 2,587 మంది (46.87శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలికలు 1,713 మంది (54.40శాతం), బాలురు 874 మంది (36.88శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ ప్రథమ సంవత్సరం రాష్ట్రంలో మెదక్ జిల్లా 6వ స్థానంలో నిలిచింది. మొత్తం 634 మంది పరీక్షలు రాయగా... 441 మంది(69.56 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలికలు 265 మంది (83.33శాతం), బాలురు 176 మంది(55.70 శాతం) ఉన్నారు.

● ఇంటర్ ద్వితీయ సంవత్సర జనరల్ విభాగంలో మొత్తం 5,067 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా.. 3,013 మంది (59.4శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 1,904 మంది (65.68శాతం), 2,168 మందిబాలురు 1,109 మంది (51.1శాతం) ఉత్తీర్ణులయ్యారు. సెకండ్ ఇయర్ ఒకేషనల్ విభాగంలో రాష్ట్రస్థాయిలో జిల్లా 3వ స్థానంలో నిలిచింది. మొత్తం 505 మంది పరీక్షలు రాయగా 415 మంది (82.18శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలురు 157 మంది (71.6 శాతం), బాలికలు 258 మంది (90.21శాతం) ఉత్తీర్ణులయ్యారు.

నాలుగేళ్లుగా ఇదే తీరు..

2021-22లో ప్రథమ సంవత్సరంలో 6,621 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా.. 2,683 మంది ఉత్తీర్ణత సాధించారు. 40 శాతం నమోదైంది. ద్వితీయ సంవత్సరంలో 5,906 విద్యార్థులు పరీక్షలు రాయగా.. 2,823 మంది ఉత్తీర్ణత సాధించారు. 47శాతం నమోదైంది. 2022-23లో 6,364 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా.. 2,462 మంది (38శాతం), ఉత్తీర్ణత సాధించగా.. జిల్లా చివరి స్థానంలో నిలిచింది. 2023-24లో ఇంటర్ ఫస్టియర్ జనరల్ విభాగంలో మొత్తం 5,905 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా.. 2,786 మంది (47.18 శాతం), ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ సెకండ్ ఇయర్ ఒకేషనల్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో జిల్లా 6వ స్థానంలో నిలిచింది. మొత్తం 528 మంది పరీక్షలు రాయగా... 383 మంది(72.54శాతం) ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో రాష్ట్రంలోనే జిల్లా 28వ స్థానం నిలువగా.. ద్వితీయ సంవత్సరంలో 31వ స్థానానికే పరిమితమైంది. ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో జిల్లా వెనుకబడటం ఆందోళన కలిస్తోంది.

ప్రభుత్వ కళాశాల విద్యార్థికి రాష్ట్రస్థాయిలో రెండో స్థానం



మెదక్ ప్రభుత్వ జూనియర్ విద్యార్థి దస్తరి శివసాయి ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం సాధించాడు. మంగళవారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో 466/470 మార్కులు సాధించాడు. శివసాయిది వెల్దుర్తి మండల పరిధిలోని ఉప్పులింగాపూర్.

విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే ప్రత్యేక తరగతులు

ఇంటర్‌లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచడానికి వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే రోజువారీ తరగతులతోపాటు అదనంగా గంట స్పెషల్‌క్లాస్ నిర్వహిస్తాం. గతేడాది కంటే ఈసారి కొంత ఉత్తీర్ణత శాతం పెరిగింది. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన ఫలితాల కోసం కృషి చేస్తాం.

-మాధవి, ఇంటర్ జిల్లా నోడల్ అధికారి

బాలికలదే హవా..

- సంగారెడ్డి జిల్లాలో అమ్మాయిలే టాప్
- ఫస్టియర్‌లో 15, సెకండియర్‌లో 16వ స్థానం
- ఒకేషనల్‌లోనూ సత్తాచాటిన బాలికలు
- సర్కారు కళాశాలల్లో పడిపోయిన ఫలితాలు
- ప్రభుత్వ కళాశాలలు డీలా

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రంలోనే సంగారెడ్డి జిల్లా ఫస్టియర్‌లో 15వ స్థానం, సెకండియర్‌లో 16వ స్థానంలో నిలిచింది. గతేడాది ఫస్టియర్‌లో జిల్లా 18వ స్థానంలో నిలువగా ఈసారి మూడు స్థానాలు ఎగబాకింది. సెకండియర్‌లో గతేడాది 15వ స్థానంలో నిలువగా ఈసారి ఒక స్థానం తగ్గింది.

ఇంటర్ ఫస్టియర్ జనరల్ విభాగంలో 15,960 మంది పరీక్షలు రాయగా, 9,644 మంది పాసై 60.43 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 6,573 మందికి 3,087 మంది పాసై 46.96 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 9,387 మంది పరీక్ష రాయగా 6,557 మంది పాసై 69.85 శాతం ఉత్తీర్ణత నమోదైంది. సెకండియర్ జనరల్ విభాగంలో 14,259 మంది పరీక్ష రాయగా, 9,817 మంది పాసై 68.85 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇందులో బాలురు 5,764 మందికి 3,301 మంది పాసై 57.27 శాతం, బాలికలు 8,495 మందికి 6,516 మంది పాసై 76.70 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఫలితాల్లో అమ్మాయిలే సత్తా చాటారు.

ఒకేషనల్‌లోనూ అమ్మాయిలదే పైచేయి

ఇక ఒకేషనల్‌లోనూ బాలికల హవా కొనసాగింది. ఫస్టియర్‌లో 1,958 మంది పరీక్ష రాయగా 1,143 మంది పాసై 58.38 శాతం ఉత్తీర్ణత నమోదై జిల్లా 21వ స్థానంలో నిలిచింది. ఇందులో బాలురు 812 మంది పరీక్ష రాయగా, 329 మంది పాసై 40.52 శాతం, బాలికలు 1,146 మంది పరీక్ష రాయగా 814 మంది పాసై 71.03 శాతం ఉత్తీర్ణత నమోదైంది. సెకండియర్‌లో 1,468 మంది పరీక్ష రాయగా 1,075 మంది పాసై 73.23 శాతం ఉత్తీర్ణత నమోదై 15వ స్థానంలో నిలిచింది. ఇందులో బాలురు 578 మందికి 332 మంది పాసై 57.44 శాతం, బాలికలు 890 మందికి 743 మంది పాసై 83.48 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

గవర్నమెంటు కాలేజీలు వెనుకంజ

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫస్టియర్ ఫలితాల్లో 3,083 మందికి 904 మంది పాసై 29.32 ఉత్తీర్ణత శాతం నమోదైంది. సెకండియర్‌లో 3,072 మందికి 1,411 మంది మాత్రమే పాసై 45.93 ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఇక ఫస్టియర్ ఒకేషనల్‌లో 231 మందికి 112 మంది పాసై 48.48 ఉత్తీర్ణత శాతం నమోదైంది. సెకండియర్ వొకేషనల్‌లో 187 మందికి 137 మంది పాసై 73.26 ఉత్తీర్ణత శాతం నమోదైంది.

కేజీబీవీల్లో 68.87 ఉత్తీర్ణత శాతం

ఇంటర్ ఫలితాల్లో సంగారెడ్డి జిల్లాలోని కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కేజీబీవీ ఇంటర్ ఫస్టియర్‌లో 546 మందికి 340 మంది ఉత్తీర్ణత సాధించి, 62.27 ఉత్తీర్ణత శాతం నమోదైంది. సెకండియర్‌లో 473 మందికి 357 మంది పాస్‌కాగా, 75.48 ఉత్తీర్ణత శాతం నమోదైంది. మొత్తంగా కేజీబీవీల్లో 68.87 ఉత్తీర్ణత శాతం నమోదైంది.

పశువులెన్ని?

లెక్క తేల్చామంటున్న అధికారులు

పెరిగాయా? తగ్గాయా?

మెదక్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ పశుగణన ప్రక్రియ మెదక్ జిల్లాలో పదిహేను రోజుల ముందుగానే పూర్తయింది. ఈ నెలాఖరు వరకు గడువు ఉన్నప్పటికీ మెదక్ జిల్లాలో మాత్రం జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు, ఎన్యూమరేటర్లు గడువు లోగానే ముగించారు. ప్రస్తుతం ఆ వివరాలను కంప్యూటర్లలో నిక్షిప్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతీ ఐదేళ్లకోసారి దేశవ్యాప్తంగా పశుగణన చేపడుతుంది. చివరిసారిగా 2019లో పశుగణన చేపట్టగా గతేడాదికి ఐదేళ్లు పూర్తయ్యాయి. దీంతో గతేడాది అక్టోబరులో తిరిగి సర్వే ప్రారంభించారు. నాలుగు నెలల్లో సర్వే పూర్తిచేయాలని నిర్దేశించారు. కానీ పలు కారణాల వల్ల సర్వే ఆలస్యం కావడంతో తొలుత మార్చి 31 వరకు, అనంతరం ఏప్రిల్ 15 వరకు గడువు పొడిగించారు. అయినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో పశుగణన పూర్తికాకపోవడంతో ఈ నెల 30 వరకు గడువు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మెదక్ జిల్లాలో 91 మంది ఎన్యూమరేటర్లు, 27 మంది సూపర్‌వైజర్లు జిల్లాలోని 463 గ్రామాల్లో సర్వేలో పాల్గొన్నారు.

తగ్గిన పశువుల సంఖ్య

గత సర్వే వివరాలతో పోలిస్తే ప్రస్తుతం పశుపక్ష్యాదుల సంఖ్య తగ్గిందని సర్వేలో పాల్గొన్న సిబ్బంది తెలిపారు. గేదెలు, ఆవులు, పిల్లులు, కుక్కలు తదితర జంతువుల లెక్క తగ్గిందని పేర్కొంటున్నారు. సాపేక్షంగా లెక్కించే కోళ్ల సంతతి మాత్రం అధికమైంది. సర్వే వివరాలను మాత్రం సంబంధిత అధికారులు వెల్లడించడం లేదు. ఉన్నతాధికారులు ఇప్పుడే చెప్పవద్దన్నారని పేర్కొంటున్నారు.

లెక్కలు వెల్లడించలేము

మెదక్ జిల్లాలో పశుపక్ష్యాదుల గణన పూర్తయినప్పటికీ వివరాలు వెల్లడించవద్దని భారత పశుసంవర్ధక శాఖ సర్క్యులర్ జారీ చేసింది. దేశ వ్యాప్తంగా ఒకే సారి సర్వే వివరాలు వెల్లడించనున్నారని పేర్కొన్నారు.

-వెంకటయ్య,
జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి, మెదక్

నిప్పుల కొలిమి

ఉమ్మడి మెదక్ జిల్లాలో రెండో రోజూ అత్యధిక ఉష్ణోగ్రతలు

98 ప్రాంతాల్లో 41 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు

అత్యధికంగా మెదక్ జిల్లా పొడ్చన్‌పల్లిలో 42.8 డిగ్రీలుగా నమోదు



మంగళవారం మధ్యాహ్నం ఎండ తీవ్రతకు కోహీర్ వద్ద నిర్మానుష్యమైన హైవే

కోహీర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ ఎండల తీవ్రత పెరుగుతున్నది. మంగళవారం మరో రెండు డిగ్రీల ఉష్ణోగ్రత పెరగడంతో తీవ్రత మరింత పెరిగింది. మెదక్ జిల్లా పోడ్చన్‌పల్లిలో 42.8 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదు కాగా.. సిద్దిపేట జిల్లాలో రాఘవాపురంలో 42.8 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా కడ్పల్‌లో 42.4, డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని 98 గ్రామాల్లో 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వేసవి తీవ్రతకు మధ్యాహ్నం రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందిపడ్డారు. ఉపాధిహామీ కూలీలు ఉదయం 10 గంటల లోపే పనులు ముగించుకొని ఇంటికి చేరుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రత వివరాలు..

మెదక్ జిల్లా పొడ్చన్‌పల్లిలో 42.8 డిగ్రీలు, కౌడిపల్లి 42.7, వడ్డీ 42.6, దామరంచ 42.5, శంకరంపేట(ఆర్) 42.4, నాగపూర్ 42.4, చిట్కుల్ 42.4, పాతూర్ 42.3, కొల్చారం 42.2, సర్దన 42.2, బుజరంపేట 42.1, రాజ్‌పల్లి 42.1, మాసాయిపేట 41.9, చేగుంట 41.8, వెల్దుర్తి 41.6, అల్లాదుర్గం 41.6, నర్సాపూర్ 41.6, మెదక్ 42.6, శివ్వంపేట 41.1, రామాయంపేట 41.1, కాగజ్‌మద్దూర్ 41.1, కొత్తపేట 41.1, రేగోడు 41, చిప్పల్తుర్తి 40.9, శంకరంపేట(ఏ) 40.7, లక్ష్మాపూర్ 40.6, లింగాయపల్లి 40.4, టేక్మాల్ 40.4, బోడఘాట్ 40.4, దొంగల ధర్మారం 40.0 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సంగారెడ్డి జిల్లా కడ్పల్‌లో 42.4 డిగ్రీలు, వట్పల్లి 41.9, సిర్గాపూర్ 41.9, దిగ్వాల్ 41.8, పాల్‌వట్ల 41.8, ఫుల్కల్ 41.7, చౌటకూర్ 41.7, నారాయణఖేడ్ 41.7, జిన్నారం 41.6 రాయికోడ్ 41.5, కల్హేర్ 41.5, కంగ్టి 41.4, లక్ష్మీసాగర్ 41.1 మల్‌చెల్మ 41.1, అల్గోల్ 41.0, సత్వార్ 41.0, నిజాంపేట్ 41, అల్గోల్ 41, ముక్తాపూర్ 41, సత్వార్ 40.9, కంది 40.9, గుమ్మడిదల 40.8, హత్నూర 40.8, నాగల్‌గిద్ద 40.8, కొండాపూర్ 40.6, మనూర్ 40.6, ఝరాసంఘం 40.6, మునిపల్లి 40.6, గుండ్లమాచనూర్ 40.6, మునిపల్లి 40.6, అల్మాయిపేట 40.5, న్యాల్‌కల్ 40.4, అన్నసాగర్ 40.2, పటాన్‌చెరు 40.2, రుద్రారం 40.1, రామచంద్రపురం 40.1, సంగారెడ్డి 40.1, సదాశివపేట 40, పాశమైలారం 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సిద్దిపేట జిల్లా రాఘవపూర్‌లో 42.2 డిగ్రీలు, బెజ్జంకి 42.5, పోతరెడ్డిపెట 42.3, రాంపూర్ 42.2, పెద్దకోడూరు 42.2, తుక్కాపూర్ 42.1, కోహెడ 42.1, వెంకటరావుపేట 42.0, నారాయణరావుపేట 41.9, చిట్యాల 41.9, శనిగారం 41.8 మీర్‌దొడ్డి 41.6, గౌరారం 41.6 చికోడ్ 41.5, అబ్బిపూర్ 41.5, రేబర్తి 41.5, కొండపాక 41.5, ముస్త్యాల 41.3, కొమరవెల్లి 41.2, హుస్నాబాద్ 41.2, కట్కూర్ 41.0 మునిగడప 41.0, సముద్రాల 41, తిప్పారం 41, సిద్దిపేట 40.8, దౌల్తాబాద్ 40.8, దూళ్మిట్ట 40.5, గజ్వేల్ 40.4, నంగనూరు 40.3, కొడకండ్ల 40.3, బెజుగావ్ 40.1 లక్డారం 40 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.






















అదృశ్యమైన వ్యక్తి శవమయ్యాడు

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డ గ్రామ సమీపంలో ఈనెల 17న రాత్రి వ్యవసాయ బావిలో శవమై కనిపించిన యువకుడు ములుగు జిల్లా వెంకటాపురం గ్రామానికి చెందిన సాయిప్రకాశ్(29)గా హన్మకొండ జిల్లా పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. 15న సాయిప్రకాశ్ అదృశ్యమైనట్లు బంధువులు హన్మకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సాయిప్రకాశ్‌ను హన్మకొండలో హత్యచేసి హుస్నాబాద్ మండలంలోని జిల్లెలగడ్డ వ్యవసాయ బావిలో పడివేసి వెళ్లి ఉంటారన్న కోణంలో అక్కడి పోలీసులు కేసు విచారణ చేస్తున్నట్లు తెలిసింది. హుస్నాబాద్ పోలీసులు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా భావించి రెండురోజుల క్రితమే శవాన్ని ఖననం చేసినట్లు తెలిపారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు బాసటగా ఎంఎస్‌ఎంఈ


విజయ సూచిక చూపుతున్న మహిళా పారిశ్రామికవేత్తలు

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మహిళా పారిశ్రామికవేత్తలకు ఎంఎస్‌ఎంఈ బాసటగా నిలుస్తుందని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సంగారెడ్డిలో వీ హబ్ ద్వారా జిల్లా ఎస్‌హెచ్‌జీ, మహిళా పారిశ్రామికవేత్తలకు మంగళవారం ఎంఎస్‌ఎంఈ ర్యాంప్ ప్రోగ్రాంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. ప్రపంచ బ్యాంకు, కేంద్ర ప్రభుత్వ ఎంఎస్‌ఎంఈ నిధులతో చేపడుతున్న ఈ కార్యక్రమం ద్వారా మహిళల ఆధ్వర్యంలో నడుస్తున్న వ్యాపారాలు, పరిశ్రమలకు సపోర్టు అందుతుందన్నారు. అనంతరం వీ హబ్ డైరెక్టర్ జాహిద్ అక్తర్ షేక్, అసోసియేట్ డైరెక్టర్ ఊహ సజ్జ మాట్లాడుతూ ఈ శిక్షణలో భాగంగా టెక్స్‌టైల్, ఫుడ్ ప్రాసెసింగ్, హస్తకళలు లాంటి రంగాల్లోని వ్యాపారులకు బిజినెస్ నైపుణ్యతపై శిక్షణ అందించి ప్రోడక్ట్ డెవలప్‌మెంట్, డైవర్సిఫికేషన్, బ్రాండింగ్, మార్కెట్ యాక్సెస్, క్రెడిట్ లింకేజ్, ఎక్స్‌పర్ట్ మెంటరింగ్ మద్దతు అందనుందని వివరించారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో జ్యోతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య

పుల్‌కల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పుల్కల్ ఎస్‌ఐ పాటిల్ క్రాంతికుమార్ వివరాల ప్రకారం.. చౌటకూర్ మండలం హున్నాపూర్ గ్రామానికి చెందిన వడ్డె రాఘవ(35)కు భార్య దుర్గమ్మ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గతేడాది దుర్గమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. భార్య మరణించిందన్న బెంగతో మద్యానికి బానిసయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి మృతితో ఇద్దరు కూతుళ్లు అనాథలయ్యారు. మృతుడి మామ వడ్డె వెంకయ్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ పాటిల్ క్రాంతికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తీర్థయాత్రలకు వెళ్లి..

మిరుదొడ్డి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : తీర్థయాత్రలకు వెళ్లిన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉమ్మడి మిరుదొడ్డి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కేబుల్ ఆపరేటర్లు ఐదురోజుల క్రితం తీర్థయాత్రలకు వెళ్లారు. మిరుదొడ్డి మండలం మల్లుపల్లి గ్రామానికి చెందిన మాల చిన్నబోయ రాజు(36) మహానందిలోని ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని స్థానికులు తల్లిదండ్రులు, పోలీసులకు సమాచారమందించారు.

ఈతవెళ్లి యువకుడు మృతి

మిరుదొడ్డి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఈతకు వెళ్లి చెరువులో పడి యువకుడు చనిపోయాడు. ఎస్‌ఐ గంగరాజు వివరాల ప్రకారం.. దుబ్బాక మండలం పెద్దచీకోడ్ గ్రామానికి చెందిన తౌడబాబు(25) తన స్నేహితులతో కలిసి గ్రామంలోని పెద్దచెరువుకు ఈతకు వెళ్లారు. చెరువులో చాలా వరకు ఈత కొట్టుకుంటూ వెళ్లిన బాబు ప్రమాదవశాత్తు అందులో మునిగి చనిపోయాడు. మృతుడి తండ్రి ఎగోండ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శుభకార్యం కోసం వచ్చి.. అనంతలోకాలకు

చేర్యాల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మనువడి శుభకార్యానికి వచ్చి తాత తనువు చాలించిన సంఘటన కొమురవెల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కొమురవెల్లి గ్రామానికి చెందిన గొల్లపల్లి కనకయ్య(50) కుటుంబంతో సహా చాన్నాళ్లక్రితం హైదరాబాదులో స్థిరపడ్డారు. అక్కడ పాత ఇనుము, సీసాల క్రయ విక్రయదుకాణంతో జీవిస్తున్నారు. తన పెద్ద కుమారుడికి ఇటీవల కుమారుడు జన్మించగా, కొండపాక మండలం విశ్వనాథపల్లి గ్రామంలోని అత్తగారింటి వద్ద బారసాల నిర్వహించారు. ఇంటికి సమీపంలో ఉన్న బావిలో యువకులు ఈత కొడుతున్నారు. కనకయ్య కూడా ఈత కొడతానని దూకి మునిగి చనిపోయాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి..


కనకయ్య(ఫైల్)

గజ్వేల్ రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన గజ్వేల్ మండల పరిధిలోని రంగంపేటలో మంగళవారం చోటుచేసుకుంది. రంగంపేటకు చెందిన కిచ్చెంగారి కనకయ్య(36) మద్యం మత్తులో గ్రామంలోని పల్లె చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు.

ధాన్యం కుప్పలు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

కొండపాక, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : కొండపాక మండలం మర్పడగ శివారులో రైస్‌మిల్ వద్ద ధాన్యం కుప్పలను ఢీకొని ఒక వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. మండలంలోని సిరసనగండ్ల గ్రామానికి చెందిన బాబు బైక్‌పై సిద్దిపేట నుంచి గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డుపై పోసిన ధాన్యం కుప్పలను ఢీకొని కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది శ్రీకాంత్, రమేష్ చేరుకొని ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

పొలం విషయంలో ఇరువురికి గొడవ

● పరస్పరం కత్తితో దాడి

వెల్దుర్తి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పొలం దారి విషయంలో ఇరువురి మధ్య గొడవ జరగ్గా.. ఒకరిపై మరో వ్యక్తి కత్తితో దాడిచేసిన ఘటన మండల పరిధిలోని ఎలుకపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కానికే జయరాములు అదే గ్రామానికి చెందిన కానికే రవికి పొలానికి వెళ్లే దారి విషయంలో సోమవారం రాత్రి గొడవ జరిగింది. రవి జయరాములును తిడుతూ కత్తితో దాడిచేశాడు. దీంతో జయరాములికి తీవ్రగాయాలయ్యాయి. కుటుంబీకులు వెల్దుర్తిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుడు కానికే జయరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పిడుగుపాటుకు మూడు గేదెలు మృతి

గుమ్మడిదల/మిరుదొడ్డి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పిడుగుపాటుకు రెండు గేదెలు మృతిచెందిన సంఘటన గుమ్మడిదల గ్రామంలో చోటుచేసుకుంది. గుమ్మడిదలకు చెందిన కోర్పత్తి కృష్ణకు రెండు గేదెలు ఉన్నాయి. కాగా మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి పిడుగుపడడంతో అవి మృతిచెందాయి. ఈ విషయాన్ని పశు సంవర్థకశాఖ వైద్యాధికారి డాక్టర్ అరుణకు తెలపడంతో ఆమె ఘటనా స్థలానికి వచ్చి పంచనామా చేశారు. పిడుగుపడి పాడిగేదె మృతిచెందిన సంఘటన మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గూళ్లబాగులకు చెందిన పాడిగేదెను వ్యవసాయం పొలం వద్ద కట్టేశాడు. ఒక్కసారిగా పిడుగుపడడంతో అక్కడికక్కడే మృతిచెందింది. గేదె మృతితో రూ.60 వేల నష్టం వాటిల్లిందని కృష్ణ వాపోయాడు.

కాశీనాథ్ ఆలయ కమిటీ మాజీ చైర్మన్‌తో సహా పలువురిపై కేసు

నారాయణఖేడ్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పట్టణంలోని చరిత్రాత్మకమైన కాశీనాథ్ ఆలయంలోకి అక్రమంగా ప్రవేశించి గోతిని తవ్వి ఆలయానికి నష్టం కలిగించిన మాజీ చైర్మన్ హన్మాండ్లుతో సహా మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఆలయంలోని మండపం పక్కన ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గోతిని తవ్వించి తెలియకుండా గ్రిల్స్ ఉంచారు. సోమవారం ఆలయానికి వెళ్లిన భక్తులు గమనించి గుప్తనిధుల కోసం గోతిని తవ్వారని పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి సైతం ఆలయాన్ని సందర్శించి గోతిని తవ్విన విషయమై విచారణ జరపాలని పోలీసులకు సూచించారు. ఈ మేరకు దేవాదాయశాఖ ఈవో శివరుద్రప్ప సూచన మేరకు జూనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ చైర్మన్ హన్మాండ్లుతో సహా పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

ఇంటర్‌లో 'సర్కార్' సత్తా



సాయి దీప్తి 995 ఎంపీహెచ్‌డబ్ల్యూ | మౌనిక 964 కంప్యూటర్‌సైన్సు | పూజా 957 బైపీసీ | సింధు 954 ఎంపీసీ | సంధ్య 952 కంప్యూటర్ సైన్సు | తేజస్విని 945 బైపీసీ | ఆనంద్ 943 కంప్యూటర్‌సైన్స్ | పద్మ 935 కంప్యూటర్‌సైన్సు



స్పందన 489 ఒకేషనల్ | అక్షయ 489 సీఈసీ | హేమలత 468 కంప్యూటర్‌సైన్సు | సింధుజ 468 ఎంపీసీ | నస్రఫాతిమా 468 ఎంపీసీ | కల్పవల్లి 468 ఎంపీసీ | ఇందు 449 సీఈసీ | అల్మాస్ 436 ఎంపీసీ

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రభుత్వ కళాశాలలు ఇంటర్ పరీక్షా ఫలితాలలో తమ సత్తా చాటాయి. అనేక మంది విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. బైపీసీ, ఎంపీసీ, సీఈసీ గ్రూప్‌లలో మంచి ఫలితాలను సాధించారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా మంచి మార్కులు పొందారు.

✦ పెద్దశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీలో జి. రాజేశ్వరి(964/1000), ప్రథమ సంవత్సరం సీఈసీలో విశాల్(431) మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు.

✦ రేగోడ: రేగోడు తెలంగాణ మోడల్ కళాశాలలో 97 ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ ప్రవీణ తెలిపారు. సెకండియర్ బైపీసీలో పూజ (957/1000) మార్కులు సాధించగా, ఎంపీసీలో సింధు (954/1000), వరలక్ష్మి 901/1000 మార్కులు సాధించారని తెలిపారు.

✦ మనూరు: మనూరు జూనియర్ కళాశాలలో 93.5 శాతం ఉత్తీర్ణత వచ్చినట్లు కళాశాల పిన్సిపల్ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు.

✦ వెల్దుర్తి: వెల్దుర్తిలోని శ్రీరాయరావు సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు ప్రథమ సంవత్సరంలో 87శాతం, ద్వితీయ సంవత్సరంలో 82శాతం ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు.

✦ చిన్నశంకరంపేట: చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో 65 శాతం, దిత్వీయ సంవత్సరంలో 80 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

✦ జగదేవ్‌పూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్‌లోని మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ముగ్గురు, ఎంఈసీలో ఒకరు మంచి మార్కులు సాధించగా, ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ఇద్దరు, సీఈసీలో ఒకరు సత్తాచాటారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ స్లీవరాజు, అధ్యాపక బృందం అభినందించారు.

✦ సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి జిల్లాలో మోడల్ కళాశాల మొదటి సంవత్సరం ఫలితాల్లో 35 మంది ఉత్తీర్ణ సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 86 మంది ఉత్తీర్ణత సాధించారని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

✦ వర్గల్: వర్గల్ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 61.11 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో 27.90 శాతం ఉత్తీర్ణత సాధించారు.

✦ చేర్యాల: ఇంటర్మీడియట్ ఫలితాలలో చేర్యాల కస్తూర్బా విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. ఇంటర్ ఒకేషనల్ ద్వితీయసంవత్సరం ఎంపీహెచ్‌డబ్ల్యు విభాగంలో సాయిదీప్తి 995 మార్కులతో రాష్ట ప్రథమ ర్యాంకు సాధించింది. ఒకేషనల్ ప్రథమ సంవత్సరంలో పి.స్పందన రాష్ట్రస్థాయి ద్వితీయ, జిల్లా ప్రథమ, సీఈసీ విభాగంలో ఎల్. అక్షయ 489 మార్కులతో రాష్ట్రస్థాయి ద్వితీయ, జిల్లా ప్రథమ ర్యాంకులు సాధించారు.

✦ ముస్త్యాల మోడల్ స్కూల్‌లో ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ముగ్గురు, ద్వితీయ సంవత్సరంలో ముగ్గురు టాపర్లుగా నిలిచారు. ప్రథమ సంవత్సరంలో 64 శాతం, ద్వితీయ సంవత్సరంలో 63 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ జె.భిక్షం తెలిపారు.

✦ చేర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ ప్రథమసంవత్సరంలో 34.37శాతం, ద్వితీయ సంవత్సరంలో 42శాతం ఉత్తీర్ణతసాధించారు.

✦ సాంఘీక, సంక్షేమ గురుకుల కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 76.60శాతం, ద్వితీయ సంవత్సరంలో 85.29 శాతం ఉత్తీర్ణత సాధించారు.

✦ చేగుంట: చేగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం 65.38 శాతం ప్రథమ సంవత్సరం 35.14 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఆదర్శ పాఠశాల విద్యార్థులు 41 శాతం, ప్రథమ సంవత్సరం 31 శాతం ఉత్తీర్ణత శాతం సాధించారు. చేగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం 51 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా ప్రథమ సంవత్సరం 39శాతం ఉత్తీర్ణత సాధించారు. ఆదర్శ పాఠశాలలో ప్రథమ సంవత్సరం 65 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా ద్వితీయ సంవత్సరం 35 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని కళాశాలల ప్రిన్సిపాల్స్ కృష్ణారెడ్డి, చంద్రకళలు తెలిపారు.

✦ చిన్నకోడూరు: చిన్నకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 74 శాతం, ద్వితీయ సంవత్సరంలో 76 శాతం, ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్‌లో ప్రథమ సంవత్సరంలో 53 శాతం, ద్వితీయలో 66 శాతం ఉత్తీర్ణత సాధించారు.

✦ కొండపాక: ఇంటర్ ఫలితాల్లో కొండపాక మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 90 శాతం , మొదటి సంవత్సరం విద్యార్థులు 70 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ యజ్ఞశ్రీ తెలిపారు.

✦ ఐడీఏబొల్లారం: ఐడీఏబొల్లారం పట్టణంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ప్రతిభ కనబరిచారు. ఎంపీసీ విభాగంలో ప్రథమలో వైష్ణవి 470 మార్కులకు 465, విఘ్నేష్ 461, రాధిక 455 మార్కులు సాధించారు. బైపీసీలో ఎండి ఆయేషా 437 మార్కులు వచ్చాయి. సీఈసీలో కాజల్‌కుమారి 481, ఎంఈసీ అజిత్‌కుమార్ 396 చొప్పున మార్కులు సాధించారు. ద్వితీయ ఏడాదిలో ఎంపీసీ విభాగంలో సమీర్‌ప్రసద్ 978, ప్రియాసింగ్ 977, ఎండి రుక్సార్ 976 , బైపీసీ విభాగంలో భవిత 976, సీఈసీలో బేగం 944, ఎంఈసీ లో ప్రసన్న 957 మార్కులు సాధించారు.

✦ జహీరాబాద్: జహీరాబాద్ ప్రాంతంలో హోతి(కే) గురుకుల కళాశాలలో విద్యార్థులు 98 శాతం ఉత్తీర్ణతను సాధించారు.

✦ పాపన్నపేట: పాపన్నపేట జూనియర్ కళాశాల 72 శాతం ఉత్తీర్ణత సాధించింది. ప్రథమ సంవత్సరంలో 50 శాతం, ద్వితీయ సంవత్సరంలో 72 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నర్సింలు తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న జగదేవ్‌పూర్ మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ స్లీవరాజు



కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌కు స్వాగతం పలుకుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

దేశాభివృద్ధిలో ఐఐటీ విద్యార్థులు కీలకం

కంది, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తు నిర్మాణంలో ఐఐటీ విద్యార్థులు కీలకపాత్ర వహించాలని కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఐఐటీ డైరెక్టర్ బీఎస్‌మూర్తి ఆయనకు స్వాగతం పలికారు. నూతన పరిశోధనలు, విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలు, ఐఐటీ నుంచి ప్రభుత్వరంగ అభివృద్ధికి తోడ్పాటు తదితర విషయాలను గవర్నర్‌కు బీఎస్ మూర్తి వివరించారు. ఐఐటీ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ల్యాబ్‌లో అత్యాధునిక పరిశోధనలు, స్టార్టప్ సహకారాలు, పరిశ్రమలతో భాగస్వామ్యాల గురించి గవర్నర్‌కు వివరించారు. ముఖ్యంగా ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గ్రీన్ ఎనర్జీ, హైడ్రోజన్ ఫ్యూయల్ టెక్నాలజీ తదితర రంగాల్లో ఐఐటీ చేస్తున్న పరిశోధనలపై ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ భవిష్యత్ భారతదేశ నిర్మాణంలో ఐఐటీ విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని, ఆధునిక సాంకేతికత వినియోగంతో దేశ ఆర్థిక అభివృద్ధికి తోడ్పటునందించాలని పేర్కొన్నారు.



కలెక్టర్, ఎమ్మెల్యేలకు కంటైనర్ క్లినిక్ పనితీరును వివరిస్తున్న సంస్థ యాజమాన్యం

కంటైనర్ క్లినిక్‌తో సత్వర వైద్య సేవలు

కంగ్టి/సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కంటైనర్ క్లినిక్‌తో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సత్వర వైద్య సేవలందుతాయని కలెక్టర్ క్రాంతి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కంగ్టిలో సహారా రూరల్ హెల్త్ సెంటర్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్) సంయుక్తంగా ఏర్పాటు చేసిన కంటైనర్ క్లినిక్, గ్రాంబులెన్స్‌లను వారు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన, ఆర్థికంగా వెనుకబడిన వారు నివసించే ప్రాంతమైన కంగ్టిలో కంటైనర్ క్లినిక్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సహారా, ఐఓసీఎల్ సేవలకు వారు ప్రశంసించారు. కార్యక్రమంలో సహారా సంస్థ డైరెక్టర్ మఠం శంకర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రతిమ, సభ్యులు రవీందర్ రాథోడ్, ఐఓసీఎల్ జీఎం కైలాస్‌కాంత్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో ఆరోగ్యం పైలం

మండుతున్న ఎండలు.. పొంచిఉన్న వ్యాధుల ముప్పు.. జాగ్రత్తలు పాటిస్తేనే మేలు



మెదక్ కల్చరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండిపోతున్నాయి. ఏప్రిల్‌లోనే గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలు దాటుతుండటంతో ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. వేసవిలో కేవలం ఎండలు, ఉష్ణోగ్రతలు పెరిగిపోయి ఇబ్బందులు తలెత్తుతాయని భావిస్తాం. కానీ, కేవలం ఎండ వేడి పెరగడమే కాదు అనేక రకాల వ్యాధులు, ఆరోగ్య సమస్యలు కూడా వస్తుంటాయి. ఆస్తమా, ఊపిరితిత్తుల సమస్య, చర్మ సమస్యలు, కలరా, విరేచనాలు డీహైడ్రేషన్, వడదెబ్బ లాంటివి ఈ కాలంలో ఎక్కువగా వస్తుంటాయి. గుండెపోటు వంటి సమస్యలు కూడా ఎండాకాలంలో ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉంది.

ఆస్తమాతో జాగ్రత్త...

ఎండాకాలంలో ఆస్తమా మరింత ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆస్తమాతో బాధపడే పిల్లలకు సమస్య ఎక్కువవుతుంది. వేసవిలో తేమశాతం ఎక్కువ ఉండడం వలన సూక్ష్మజీవులు, ఫంగస్ వంటివి ఎక్కువ అభివృద్ధి చెందుతాయి. ఎండాకాలంలో గాలిలో చేరే కాలుష్యం ఎక్కువ సేపు విస్తరిస్తూనే ఉంటుంది. ఈ కారణాలతో ఆస్తమా ఎక్కువయే అవకాశం ఉంది. అందుకే ఆస్తమా రోగులు వేసవి కాలంలో తమ వెంట ఆస్తమాకు వాడే ఔషధాలు తప్పకుండా ఉంచుకోవాలి. వీలైనంత వరకు దుమ్ము, ధూళి, కాలుష్యానికి దూరంగా ఉండాలి.



చర్మవ్యాధులు అధికం...

ఎండాకాలంలో వేడి ఎక్కువగా ఉండడంతో పాటు సూర్యరశ్మిలోని అతినీలలోహిత కిరణాల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల ఎక్కువ సేపు ఎండలలో తిరిగితే చర్మం కమిలిపోతుంది. దీనినే సన్ బర్న్‌గా పిలుస్తారు. దీంతో చర్మం కమిలిపోతుంది. ఎర్రగా మారుతుంది. చిన్న చిన్న కురుపులు, పొక్కులు ఏర్పడి మంటగా ఉంటాయి. ఎండలలో చర్మం కమిలి పోకుండా ఉండేందుకు తెల్లని, పలుచటి వస్త్రాలు వేసుకోవాలి. ఎండలలో వెళ్లే ముందు సన్ స్క్రీన్ లోషన్‌లు రాసుకోవడం వలన ఫలితం ఉంటుంది.

ప్రాణాంతక మైనది హైపర్ థర్మియా...



అధిక వేడి కారణంగా శరీర ఉష్ణోగ్రతలు బాగా పెరుగుతుంటాయి. దీంతో పలు రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. వీటన్నిటిని కలిపి హైపర్ థర్మియాగా పిలుస్తారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, పెద్ద వయసుగల వారు దీని బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంది. సాధారణంగా మన దేహంలో అంతర్గతంగా ఉష్ణాన్ని నియంత్రించే వ్యవస్థలు ఉంటాయి. చర్మం, శ్వాసప్రక్రియ ద్వారా శరీరంలోని అధిక వేడి బయటకు వెళుతుంది. కానీ ఎండలు బాగా పెరిగిపోయినప్పుడు శరీరం అధిక వేడిమిని తట్టుకోలేక, హైపర్ థర్మియా సమస్య మొదలవుతుంది. వడ దెబ్బ తగలడం, నీరసం, వికారం, వాంతులు, విరేచనాలు, తల తిరగడం, కండరాలలో వణుకు, పట్టు సడలిపోవడం, మతిస్థిమితం కోల్పోవడం, శ్వాస వేగం, గుండె కొట్టుకొనే వేగం పెరిగిపోవడం, తల నొప్పి వంటివి వస్తాయి. చివరకు కోమాలోకి వెళతారు. ఈ పరిస్థితి చాల ప్రమాదకరం. కొద్దీ సమయం ఆలస్యం చేస్తే మరణించే అవకాశం కూడా ఉంటుంది.

వేడి జలుబు...

శీతకాలంలో లాగానే వేసవి కాలంలోనూ తీవ్రమైన జలుబు చేసే అవకాశం ఉంటుంది. వేసవిలో రైనో, కరోనా, పర ఇన్ ఫ్లూయెంజాలాంటి రక రకాల వైరస్‌లు వస్తుంటాయి. చలికాలంలో సంక్రమించే వైరస్‌ల కన్నా ఇవి మరింత ప్రభావంతంగా ఉంటాయి. వీటి వల్ల జలుబు కాకుండా శ్వాస సంబంధిత ఇబ్బందులు ఎక్కువగా ఉంటాయి. డయేరియా, తలనొప్పి, ఎడతెగని దగ్గు వస్తాయి. మందులు వాడిన ఎక్కువ రోజులు ఇలానే ఉండే అవకాశం ఉంటుంది. దీంతో పాటు గొంతు నొప్పి, ముక్కులోని శ్లేష్మం మంటగా ఉంటుంది.

కిడ్నీలో రాళ్లు.. మూత్రనాళల ఇన్ఫెక్షన్లు..

ఎండాకాలంలో మూత్ర నాళ సమస్యలు ఎక్కువగా వస్తుంటాయి. అంతే కాదు కిడ్నీలో రాళ్లు ఏర్పడడానికి వేసవి పరిస్థితులు కారణమవుతాయి. ముఖ్యంగా మహిళలో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. వేసవిలో శరీరానికి ఎక్కువ నీరు అవసరం. శరీరం ఉష్ణోగ్రతను అదుపులో ఉంచుకోవడానికి చెమటను బయటకు ఎక్కువ స్రవించడం. శరీరంలో డీహైడ్రతోన్ పరిస్థితి వస్తుంది. దీంతో మూత్ర పిండాలలో వడపోత సరిగా లేక రాళ్లు ఏర్పడుతాయి. దీంతో మూత్రనాళ సమస్యలు వస్తాయి. అందువలన వేసవిలో దాహం వేసిన వేయకపోయిన తరచూ నీరు తాగడం మంచిది.

వడదెబ్బ బారిన పడొద్దు..

కొండపాక, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వేసవిలో బయటికి వెళ్తే వడదెబ్బ ప్రమాదం పొంచి ఉంటుంది. జాగ్రత్తలు తీసుకుంటే ఎండాకాలంలో వడదెబ్బ నుంచి బయట పడవచ్చు. ఎండలు ఎక్కువైనప్పుడు తీవ్ర వడగాల్పులు వీచినప్పుడు వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వడదెబ్బ లేదా ఎండదెబ్బ అంటే పరిసరాల్లో ఎక్కువ ఉష్ణోగ్రత వల్ల శరీరంలోని వేడిని నియంత్రించే విధానం లోపించడం, సరైన మోతాదులో ద్రవపదార్థాలని తీసుకోకుండా, అధిక వేడిని శరీరం తట్టుకోలేనప్పుడు ఇది సంభవిస్తుంది. అధిక ఉష్ణోగ్రతలు, శరీరం యొక్క ప్రాథమిక అవయవాలు విఫలమయ్యేలా చేస్తాయి. వడదెబ్బ బారిన పడిన వ్యక్తికి తీవ్రమైన తలనొప్పి వస్తుంది. నాడి వేగంగా కొట్టుకుంటుంది. నాలుక తడి ఆరిపోయి ఎండిపోతుంది. శరీరంలో కనీస నీటి శాతం తగ్గిపోవడం మనిషి పాక్షిక లేదా పూర్తిగా అపస్మారక స్థితికి చేరడం, శరీరంలో నిస్సత్తువ గుండెలో దడ, దమ్ము నీరసం చెమట పట్టడం శరీరం వేడి కడగడం ఏర్పడతాయి. వడదెబ్బకు గురైన వారిని వెంటనే నీడకు తీసుకెళ్ళాలి సదరు వ్యక్తి శరీరాన్ని చల్లని నీటిలో ముంచిన గుడ్డతో తుడవాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరి నీళ్ల, గ్లూకోజ్ లేదా ఓఆర్‌ఎస్ కల్పిన నీటిని తాగించాలి. తగినంత గాలి ఆడేటట్లు చేయాలి.

ఎండాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిందే..



రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. మధ్యాహ్న సమయంలో అత్యవసర పని ఉంటేనే బయటకు వెళ్లాలి. బయటకు వెళ్లే సమయంలో తప్పనిసరిగా మంచినీళ్ల బాటిల్ దగ్గర ఉంచుకోవాలి. రోజూ మూడు నుంచి నాలుగు లీటర్ల నీరు తాగాలి. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు అవసరం ఉంటేనే బయటకు వెళ్లాలి. తప్పనిసరిగా విధులు నిర్వహించే వారు మాత్రం మధ్యలో నీరు, ఓ ఆర్ ఎస్ తాగాలి. కీరదోస మజ్జిగ, పుచ్చకాయ లాంటివి తీసుకోవాలి. వడదెబ్బకు గురైన వారిని వెంటనే చల్లని వాతావరణానికి తీసుకువెళ్లాలి. శరీర ఉష్ణోగ్రతను తడి గుడ్డ ఐస్ ముక్కలతో తగ్గించాలి.

- డాక్టర్ శ్రీధర్, కొండపాక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్

ఎండల్లో ఆరోగ్యం జాగ్రత్త



వేసవిలో ఆరోగ్య సమస్యలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా దేహంలో నీటి శాతం తగ్గి డిహైడ్రేషన్ సమస్యలు వస్తాయి. దీని వలన బీపీ, పొటాషియం తగ్గుతాయి. కొన్ని సార్లు స్పృహ తప్పి పడిపోయే అవకాశం ఉంటుంది. ఎండల్లో ఎక్కువగా తిరగడం వలన చర్మ సమస్యలు కూడా వస్తాయి. చల్లని పానీయాలు, నాసిరకంగా ఉన్న ఐస్ క్రీంలు తీసుకోవడం గొంతు సమస్యలు వస్తాయి. బయటకు వెళ్లినప్పుడు తప్పకుంఅ తలపై తెల్లటి రుమాలు తలకు చుట్టుకోవాలి. కండ్లకు చలువ అద్దాలు తొడుక్కోవడం మంచిది. తరచూ నీటిని తాగండి. ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే దగ్గరలోని ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలి. అన్ని ఆసుపత్రులలో ఓఆర్ ఎస్, మందులు అందుబాటులో ఉన్నాయి.

డాక్టర్ శ్రీరాం, మెదక్ జిల్లావైద్యాధికారి

అండ లేదు.. నీడ లేదు

వదిలేసి వెళ్లిన తల్లి

- తిరిగిరాని లోకాలకు తండ్రి
- అనాథలైన ముగ్గురు చిన్నారులు
- ప్రభుత్వ హాస్టళ్లలో చదువులు
- సెలవుల్లో ఎక్కడికి వెళ్లాలనే దైన్యం
- సాయం కోసం ఎదురుచూపులు

పాపన్నపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కంటికి రెప్పలా కాపాడాల్సిన తల్లి వదిలేసి వెళ్లిపోయింది. తండ్రిని అనారోగ్యం కాటేసింది. ఆడి పాడే వయస్సులో ఆలనాపాలనా చూసే వారు లేక ఆ చిన్నారులు దిక్కుతోచకన్నారు. నా అన్నవారు ఉన్నా.. సహాయం చేయని పరిస్థితి. చిన్న వయస్సులోనే పెద్ద కష్టం ఎదుర్కొంటున్న వారిప్పుడు ఆదుకునే ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు.

మెదక్ జిల్లా పాపన్నపేట మండలం కుర్తివాడ గ్రామానికి చెందిన భూతిపురం రవి, సంపూర్ణలకు ఇద్దరు కుమార్తెలు లావణ్య, అనురాధలతో పాటు ఓ కుమారుడు నవీన్ ఉన్నారు. భార్యాభర్తలు కాయాకష్టం చేసుకుంటూ అన్యోన్యంగా ఉంటున్న సమయంలోనే ఏమైందేమో గానీ నవీన్ పుట్టిన ఏడాదికే తల్లి పిల్లలను ఎటో వెళ్లిపోయింది. దీంతో చిన్నారుల ఆలనా పాలన తండ్రిపై పడింది. విధి వంచితులైన ఆ చిన్నారులకు ఆరు నెలల క్రితం తండ్రిని కూడా దూరం చేసింది. ఈ క్రమంలో ఆర్థికంగా లేకున్నా పెద్ద మనసుతో మేనత్త లక్ష్మి పిల్లలను చేరదీసి ఆశ్రమ పాఠశాలలో చేర్పించింది. టేక్మాల్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో లావణ్య ఎనిమిదవ తరగతి, అనురాధ ఏడవ తరగతి చదువుతున్నారు. నవీన్ కొత్తపల్లి బీసీ వసతి గృహంలో మూడో తరగతి చదువుతున్నాడు. ఇంతవరకు బాగానే ఉన్నా.. విద్యాసంవత్సరం ముగింపునకు రావడంతో ఆ చిన్నారులు వేసవి సెలవుల్లో ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితుల్లో పడిపోయారు. సెలవులు వస్తే సొంత గ్రామంలో తలదాచుకోవడానికి ఇల్లు లేదు. గతంలో సెలవులు వస్తే తండ్రి వద్దకు వచ్చేవారు. తండ్రి ఉన్నప్పుడు నివసించిన గుడిసె శిథిలావస్థకు చేరి, కనీసం తలదాచుకునే పరిస్థితి లేదు. మేనత్త బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లి అక్కడే కూలి పనులు చేసుకుంటూ బతుకుతోంది. ఆమె దగ్గరకు వెళ్లి ఉండే పరిస్థితి లేదు. ఆమె కూలి పనులు వదులుకుని పిల్లల కోసం గ్రామానికి వచ్చి ఉండే పరిస్థితి లేదు. దీంతో పిల్లల బాధ్యతను చూసుకునేది ఎవరన్నది ప్రశ్నార్థకంగా మారింది.

సహాయం చేసే చేతుల కోసం ఎదురుచూపులు...

తల్లిదండ్రులు లేని తమను ఆదుకునేందుకు మనసున్న మహారాజులు ముందుకు రాకపోతారా అని ఆ చిన్నారులు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం కూడా అనాథ చిన్నారులను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు తోడ్పాటు అందించడానికి దాతలు ముందుకు వస్తే పై చదువులు చదువుతామంటూ వారు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.



శిథిలమైన గుడిసె ఎదుట చిన్నారులు

జిన్నారంలో ఉద్రిక్తత



జిన్నారం, ఏప్రిల్, 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శివుడి మట్టి విగ్రహం ధ్వంసం చేసిన ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ ఘటనకు స్థానిక మదర్సాలో చదివే విద్యార్థులే కారణమని హిందువాదులు మదర్సా ఎదుట ధర్నా చేయటంతో పరిస్థితి తీవ్రంగా మారింది. జిన్నారం శివారులో నిర్మాణంలో ఉన్న శివాలయం గుట్ట వద్ద బండరాయిపై ఏర్పాటు చేసిన శివుడి మట్టి విగ్రహం మంగళవారం సాయంత్రం ధ్వంసం అయినది. అదే సమయంలో అక్కడ ఉన్న స్థానిక మదర్సా విద్యార్థులను స్థానికులు నిలదీశారు. ఈ విషయం సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి వందల సంఖ్యలో హిందూవాదులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. ఈ ఘటనకు మదర్సా విద్యార్థులే కారణమని ఆరోపిస్తూ మదర్సా ఎదుట ధర్నా నిర్వహించారు. మదర్సాపై దాడికి యత్నించారు. ఈ ఘటనలో అక్కడ ఉన్న సీసీ కెమెరాలు, గేటు ధ్వంసం అయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐలు నయీమోద్దీన్, వినాయక్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, లాలునాయక్‌లు భారీ సంఖ్యలో పోలీసులు ఆందోళనకారులను అడ్డుకుని ఘటనా స్థలం నుంచి పంపించి వేశారు. ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సందర్శించి వివరాలు సేకరించారు.

న్యూస్ బాక్స్

ముగిసిన భేతాళస్వామి జాతర

అల్లాదుర్గం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఎంతో ప్రసిద్ధి చెందిన అల్లాదుర్గం బేతాళ స్వామి జాతర మంగళవారం ముగిసింది. ఐదురోజుల తర్వాత భక్తులు పాచి బండ్లను పట్టణంలోని దుర్గమ్మ దేవతకు, పోచమ్మ దేవత చుట్టూ ప్రదర్శించి మొక్కులను తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీసులు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

'కేసులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలి'

నిజాంపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : దళితులపై దాడులు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులపై వెంటనే విచారణ జరిపి పరిష్కరించేలా కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా అధ్యక్షుడు గరుగుల శ్రీనివాస్ తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో దళితుల సమస్యలపై మంగళవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను తన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి విన్నవించి మాట్లాడారు.

నీటి ఎద్దడి ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

నిజాంపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : వేసవి దృష్ట్యా ప్రజలకు నీటి ఎద్దడి ఏర్పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ బిక్షపతి పేర్కొన్నారు. మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో మంగళవారం పంచాయతీ కార్యాలయంలో నీటి సరఫరా అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామస్థులు నీటిని వృథా చేయొద్దని సూచించారు.

బీఆర్ఎస్ నాయకుల విమర్శలు తగవు

గుమ్మడిదల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చడంలో విఫలమైందంటూ బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న విమర్శలు తగవని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పుట్ట నర్సింగరావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

కొనసాగిన సప్తాహ

నారాయణఖేడ్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని భూమయ్య కాలనీలోని శివ పంచాయతన అభయాంజనేయస్వామి ఆలయంలో అఖండ హరినామ సప్తాహ రెండోరోజు మంగళవారం కొనసాగింది. కర్ణాటకలోని బీదర్ జిల్లా బాల్కికి చెందిన అనుసుజరెడ్డి, మనూరు మండలం కమలాపూర్‌కు చెందిన వామన్‌రావు మహారాజ్ కాలకీర్తన నిర్వహించారు. నర్సారెడ్డి, కాశీనాథ్‌పటేల్ సౌజన్యంతో అన్నప్రసాదం చేపట్టారు.

కొనసాగుతున్న పునఃప్రతిష్ఠాపనలు

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పెద్దశంకరంపేటలోని సీతారామ చంద్రస్వామి పునఃప్రతిష్ఠాపనలు మంగళవారం కొనసాగాయి. ఉదయం వేద స్వస్తి గురు వందనం, మంటప ఆవాహిత దేవత పూజలు, జపాలు తర్పణాలు, దాన్యాది వాసం తదితర పూజలు నిర్వహించారు.

'నూతన విద్యావిధానం అమలు చేయాలి'

నర్సాపూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : నూతన విద్యా విధానాన్ని అమలు చేయాలని తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్లం పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఈ విధానం వల్ల విద్యార్థులకు నచ్చిన వృత్తిని ఎంచుకుని ఉద్యోగాలు సాధించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, నాయకులు నరేందర్‌గౌడ్, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి

జిన్నారం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్నిరంగాల్లో ప్రతిభ చాటేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సంగారెడ్డి ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ అరుణబాయి అన్నారు. మంగళవారం జిన్నారం ఎస్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణ, పాఠ్యాంశాలపై ఉపాధ్యాయులు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల, ప్రిన్సిపాల్స్, పాల్గొన్నారు.

ఇండ్ల పనులు పరిశీలన

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంరంపేట మండలంలోని మిర్జాపల్లి తండాలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను జిల్లా హౌజింగ్ పీడీ మాణిక్యం ఎంపీడీవో దామోదర్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లను నాణ్యతగా నిర్మించుకోవాలన్నారు.

బైక్ మెకానిక్ ఉచిత శిక్షణ

శివ్వంపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత యువకులకు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం సంగారెడ్డిలో మెదక్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ పురుషులకు ఉచిత బైక్ మెకానిక్ శిక్షణ ఇస్తున్నామని ఏపీఎం డైరెక్టర్ వంగ రాజేంద్రప్రసాద్ తెలిపారు. మే 9 నుంచి జూన్ 8 వరకు నెలరోజులపాటు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ పొందేందుకు 18 నుంచి 45 ఏళ్లలోపు అర్హత ఉంటుందని బైక్ మెకానిక్, ఇంజన్ రిపేర్, ఎలక్ట్రికల్ వైరింగ్, సిస్టంతో సహ శిక్షణ ఇస్తామన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే 'భూభారతి'

పెద్దశంకరంపేట/రేగోడు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకొచ్చిందని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేటలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన భూభారతి అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. భూ సమస్యలను ఈ పోర్టల్ ద్వారా సులభంగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ భూభారతి చట్టంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, మండల ప్రత్యేక అధికారి, ఆర్అండ్‌బీఈఈ సర్దార్ సింగ్, తహసీల్దార్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. రేగోడు మండలంలోని రైతువేదికలో నిర్వహించిన భూభారతి సదస్సుకు కలెక్టర్ రాహుల్‌రాజ్ ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దత్తారెడ్డి, ఎంపీడీవో సీతారావమ్మ పాల్గొన్నారు. కాగా రేగోడు రైతువేదికలో ఏర్పాటుచేసిన భూభారతి అవగాహన సదస్సులో సరైన సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని రైతులు ఇబ్బంది పడ్డారని మాజీ జడ్పీటీసీ యాదగిరి మండిపడ్డారు. అలాగే రేగోడు ప్రభుత్వాస్పత్రిలో వడదెబ్బ, ఇతర వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఓపీ రిజిస్టర్, మందుల నిల్వలు, రక్త పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు శ్వేత, వికాస్, ఎంపీహెచ్‌ఈవో ఈశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.



పెద్దశంకరంపేటలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, పక్కన ఎమ్మెల్యే సంజీవరెడ్డి



నిజాంపేటలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి

ధరణికి ప్రత్యామ్నాయంగా 'భూభారతి'

నారాయణఖేడ్/కల్హేర్/కంగ్టి, ఏప్రిల్ 22. (ఆంధ్రజ్యోతి) : ధరణికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం భూభారతి కార్యక్రమాన్ని చేపట్టిందని కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. మంగళవారం నాటి రాత్రి మండల కేంద్రమైన నిజాంపేటలోని క్ష ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన భూభారతి అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ మాధురి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఆర్డీవో అశోక్ చక్రవర్తి పాల్గొన్నారు. కల్హేర్‌లో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో కలెక్టర్ వల్లూరు క్రాంతి ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, తహసీల్దార్ శివశ్రీనివాస్ పాల్గొన్నారు. కంగ్టి మండల పరిధిలోని తడ్కల్‌లో ఏర్పాటు చేసిన భూభారతి అవగాహన సదస్సులో కలెక్టర్ క్రాంతి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొని మాట్లాడారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

● ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు



పాపన్నపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

పాపన్నపేట/వెల్దుర్తి/శివ్వంపేట/చిన్నశంకరంపేట/మునిపల్లి/కొల్చారం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. మంగళవారం పాపన్నపేట మండల పరిధిలోని ఎల్లాపూర్, శానాయిపల్లి, పొడచానుపల్లితండా, లక్ష్మీనగర్, కొత్తపల్లి, పాపన్నపేట, ఎనికేపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సాయిలుఉ, ఏఈవో పద్మ, ఐకేపీ సీసీలు పాల్గొన్నారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. మంగళవారం వెల్దుర్తి మండల పరిధిలోని శెట్టిపల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని డీఆర్డీవో శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ కృష్ణ, ఆర్ఐ నర్సింగ్‌యాదవ్ ఉన్నారు. శివ్వంపేట మండల పరిధిలోని శివ్వంపేట, పాంబండ, పోతులబోగుడ, కొత్తపేట, తాళ్లపల్లితండా, మల్లుపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి ప్రారంభించారు. చిన్నశంకరంపేట మండలంలోని జంగరాయి, గవ్వపల్లి, అంబాజీపేట గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ మన్నన్ పరిశీలించారు. మునిపల్లి మండలంలోని పెద్దచెల్మెడలో పీఏసీఎస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, పెద్దచెల్మెడ పీఏసీఎస్ చైర్‌పర్సన్ పద్మదుర్గయ్య పరిశీలించారు. కొల్చారం మండల పరిధిలోని వరిగుంతంలో కొనుగోలు కేంద్రాన్ని మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గఫూర్, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్, సీఈవో రాములు తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను జయప్రదం చేద్దాం

● జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 27న వరంగల్‌జిల్లా ఎల్కతుర్తితో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రతం చేద్దామని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. మంగళవారం మండలస్థాయి నాయకులు, ముఖ్యకార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించి మాట్లాడారు. రజతోత్సవ సభకు జహీరాబాద్ నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా మండల పార్టీల అధ్యక్షులు నారాయణ, సంజీవరెడ్డి, వెంకటేశం, నాయకులు పాల్గొన్నారు.

శిక్షలు నేరస్థులకు హెచ్చరిక కావాలి



సీఐ మధుబాబును అభినందిస్తున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్, గంజాయి కేసుల్లో పడే శిక్షలు పడ్డ నేరస్థులు మళ్లీ నేరాలకు పాల్పడకుండా నిరోధించాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి అన్నారు. గతంలో సంగారెడ్డిలో పనిచేసిన ఎక్సైజ్ అధికారులు మంచి పనితీరును కనబరిచి కేసులు నమోదు చేయడంలోనే కాకుండా విచారణపరంగా సమర్థవంతంగా పనిచేసి నిందితులకు శిక్షలు పడేలా చేశారన్నారు. హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యాలయంలో నాలుగు కేసుల్లో శిక్షలు పడేటట్లు చేసి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ (ప్రస్తుత ధూల్ పేట్ ఎస్‌హెచ్‌ఓ) జె.మధుబాబును మంగళవారం అభినందించి నగదు రివార్డును అందచేశారు. అలాగే సంగారెడ్డిలో పనిచేసిన డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మరో ఏడుగురు అధికారులను అభినందించి నగదు రివార్డుల అందజేశారు.

తల్లి పాలల్లోనే పోషకాలు అధికం: లలితకుమారి



మాట్లాడుతున్న లలితకుమారి

జహీరాబాద్/సంగారెడ్డి అర్బన్/మనూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : తల్లి పాలలోన్లే పోషకాలు అధికంగా ఉంటాయని జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారి లలితకుమారి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఐసీడీఎస్ సిబ్బంది, తల్లులతో కలిసి పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ తల్లిపాల విశిష్టత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో ఆంజమ్మ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు. సంగారెడ్డిలోని సోమేశ్వరవాడ, రాజంపేట, రిక్షా కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో హోమియోపతి విభాగం ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులు, చిన్నారుల తీసుకోవాల్సిన పోషకాహారం, యోగా, రోజూ దినచర్య, హోమియోపతి మందులు ఉపయోగాలపై హోమియోపతి సీనియర్ మెడికల్ ఆఫీసర్ డా.నర్మదషిండే వివరించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్ట్ ఎన్.రమేశ్, యోగా ట్రైనర్లు అజయ్, సురేశ్ పాల్గొన్నారు. మనూరు మండలంలోని ఐకేపీ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ నిర్వహించారు. తహసీల్దార్ విష్ణుసాగర్, ఎంపీడీవో హైమద్ హుస్సేన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యమున హాజరై పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నర్సాపూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాన్ని విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్ గ్రంథాలయాన్ని ఆమె సందర్శించి మాట్లాడారు. గ్రంథాలయంలో విజ్ఞాన, కాంపిటేషన్‌కు సంబంధించిన పుస్తకాలు ఉన్నాయని చెప్పారు.

యువవికాసం దరఖాస్తు విచారణ వేగవంతం చేయాలి

● కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువవికాసం దరఖాస్తుల విచారణ ప్రక్రియ వేగవంతం చేసి, వచ్చేనెల 20 వరకు పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మండలస్థాయి విచారణ బృందాల ఏర్పాటు, తదితర అంశాలపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా రాజీవ్ యువ వికాసం పథకానికి ఎస్సీలు 6,711 మంది, ఎస్టీ 3,461 మంది, బీసీలు 19,688 మంది, మైనార్టీలు 2,175 మంది ఈబీసీలు 550 మంది, క్రిస్టియన్లు 55 మంది దరఖాస్తులు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో శ్రీనివాసరావు, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్లు, వివిధ సంక్షేమాశాఖాధికారులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లింలకు మేలు

మెదక్ అర్బన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లింలకు మేలు జరుగుతుందని, పేదల హక్కులు పేదలకే దక్కుతాయని బీజేపీ మెదక్ జిల్లా ఇన్‌చార్జి మీసాల చంద్రయ్య పేర్కొన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మల్లేశం గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన వక్ఫ్ చట్టంపై నిర్వహించిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. కొంతమంది పెత్తందారుల చేతుల్లో వక్ఫ్‌బోర్డు ఆస్తులు దుర్వినియోగం అవుతున్నాయన్నారు. 1954లో వక్ఫ్ బోర్డు ఏర్పాటైందని, 31 వేల లక్షల భూముల ఉన్నాయని లెక్కలో పేర్కొన్నారన్నారు. ఆ నిధులతో ఆసుపత్రులు కట్టలేదని, పేద ముస్లీం మహిళలకు ఆర్థిక సాయం కానీ, పిల్లలకు విద్య చూపించలేదన్నారు. కాంగ్రెస్ ముస్లింలను ఓటు బ్యాంకుగా వాడుకుంటుందని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మ్యాథ్స్, సైన్స్ జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని మాధవి

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రీయ ఆవిష్కార్ అభియాన్ పథకంలో భాగంగా మాథ్స్, సైన్స్ జిల్లాస్థాయి పోటీలు మెదక్ జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో చిన్నశంకరంపేట తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థిని మాదవి జిల్లాస్థాయిలో మొదటి బహుమతి పొందింది. ఈ మేరకు డీఈవో రాధాకిషన్ మాధవికి బహుమతి అందజేసి అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో 'ప్రైవేటు' విద్యార్థుల సత్తా



సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీస్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు స్వీట్లు తినిపిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ఫలితాల్లో సంగారెడ్డి శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఫస్టియర్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకుగాను ఎం.రమాదేవి 463 మార్కులు, శ్రీనిధి 461 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో 440 మార్కులకుగాను కె.నందిని 435 మార్కులు, డింపల్ 434 మార్కులు, మౌనిక 434 మార్కులు సాధించారు. సీఈసీ విభాగంలో 500 మార్కులకుగాను జోహ తజ్‌మీన్ 475 మార్కులు, ఎంఈసీ విభాగంలో 500 మార్కులకుగాను ఎస్.పావని 471 మార్కులు సాధించారు. సెకండియర్ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకుగాను నందిని 989 మార్కులు, సయ్యదా మిన్‌హాజ్ నజ్‌నీన్ 989 మార్కులు, బైపీసీ విభాగంలో 1000 మార్కులకుగాను జైనబ్ ఫాతిమా 991 మార్కులు, ఎం.శిరీష 990 మార్కులు సాధించారు. సీఈసీ విభాగంలో 1000 మార్కులకు ఆయుశ్రీ 957 మార్కులు, ఎంఈసీ విభాగంలో 1000 మార్కులకు ఆమెషాజబీన్ 957 మార్కులు సాధించారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్, విద్యాసంస్థల అధినేత ఈ.సాలోమాన్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి అభినందించారు.

'శ్రీ అక్షయ' కళాశాల హవా

కొండాపూర్ మండలం మల్కాపూర్ చౌరస్తా సమీపంలోని శ్రీఅక్షయ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చారు. ఫస్టియర్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకుగాను సింధూజ, నస్రపాతిమాలు 468 మార్కులు, అనూష 467 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో 440 మార్కులకుగాను తుబాతహరీన్ 437 మార్కులు, భుస్రాకమ్రాన్ 436 మార్కులు సాధించారు. ఎంఈసీ విభాగంలో 500 మార్కులకుగాను శ్రీచేతన 491 మార్కులు, రితేష్ 489 మార్కులు, సీఈసీ విభాగంలో 500 మార్కులకుగాను ఎం.లిఖిత 492 మార్కులు సాధించారు. ఇక సెకండియర్ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకుగాను శిల్పశ్రీలేఖ 993 మార్కులు, బైపీసీలో 1000 మార్కులకుగాను కె.అఖిల 992 మార్కులు, ఎంఈసీలో 1000 మార్కులకుగాను లక్ష్మీశ్రావ్య 990 మార్కులు, సీఈసీ విభాగంలో 1000 మార్కులకుగాను ప్రణిక 982 మార్కులు సాధించారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ వీరప్ప, ప్రిన్సిపాల్ శ్రీశైలం, డైరెక్టర్లు రాజుగౌడ్, భానుచందర్‌రెడ్డి, సుధాకర్ జోషి, అధ్యాపకులు అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో 'గీతా' ప్రభంజనం



టీ.కృతిక, మహేష్‌యాదవ్, ఎస్‌డీ.సాజిద్

మనోహరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ఫలితాల్లో తూప్రాన్ గీతా కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించారు. కళాశాల విద్యార్థిని కృతిక ఎంపీసీలో 470 మార్కులకు 468 మార్కులు సాధించింది. బైపీసీ విభాగంలో సీహెచ్.మహేష్ 440 మార్కులకు 433 సాధించాడు. సీఈసీ విభాగంలో సాజిద్ 500 మార్కులకు 468 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో ఎస్.కీర్తన 1000 మార్కులకు 992 మార్కులు, బైపీసీ విభాగంలో బీ.శ్రీజ 994 మార్కులు, సీఈసీ విభాగంలో సీహెచ్.నిహారిక 969 మార్కుల్లో ప్రభంజనం సృష్టించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ రామంజనేయులు విద్యార్థులను అభినందించారు.

ప్రతీ గ్రామంలో సీసీ రోడ్లు

● కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

చేగుంట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతీ గ్రామంలో, తండాల్లో సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం చేగుంట మండలంలోని ఇబ్రహీంపూర్, కిష్టాపూర్ గ్రామాల్లోని జాతీయ ఉపాధిహామీ కింద మంజూరైన రూ.18 లక్షలతో సీసీరోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామాల్లో రోడ్లు శుభ్రంగా ఉంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వడ్ల నవీన్‌కుమార్, నాయకులు చౌదరి శ్రీనివాస్, భాస్కర్, సతీష్, మోహన్‌నాయక్, కార్యదర్శులు పాల్గొన్నారు.

చదువుతోపాటు ఆటలూ అవసరమే

నర్సాపూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు చదువుతో పాటు ఆటలూ అవసరమేనని నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రెడ్డిపల్లిలో నోవార్టిస్ ఆగ్రో ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని 16 ప్రాథమిక, 6 ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్ కిట్ అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మాదవీలత, ఎంఈవో తారాసింగ్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రిజ్వాన్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేశం, మైనార్టీ సెల్ అధ్యక్షులు అజ్మత్, ఓబీసీ సెల్ మండలాధ్యక్షుడు అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా 'సినాప్స్' స్కూల్ ద్వితీయ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో చైర్మన్ డా.రాజుగౌడ్, ప్రిన్సిపాల్ సంధ్యారాణి, చిన్నారులు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని సినాప్స్ స్కూల్ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చైర్మన్ డా.రాజుగౌడ్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. చిన్నారులు, విద్యార్థుల ఆట పాటలతో సందడి చేశారు. స్కిట్‌లతో నవ్వులు పూయించారు. విద్యతో పాటు వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ కనబర్చిన చిన్నారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.సంధ్యారాణి, వైస్ ప్రిన్సిపాల్ ప్రత్యూష, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

హత్నూర, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు గున్నాల నర్సింలు తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన హత్నూర రైతువేదికలో హత్నూర మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మత్స్యశాఖ జిల్లా అధికారి ఆర్ఎల్.మధుసూధన్, కోఆపరేటివ్ సొసైటీ జిల్లా అధికారి కిరణ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నర్సింలు మాట్లాడుతూ మత్స్యకారులు ప్రభుత్వం అమలు చేసే ఆయా పథకాల ద్వారా ఆర్థికాభివృద్ధిని సాధించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ వినయ్‌కుమార్, శ్రీనివాస్‌రావు, హత్నూర సొసైటీ అధ్యక్షుడు బిక్షపతి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు కృషి

మునిపల్లి; ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : నీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సహకారంతో ప్రతి గ్రామంలో బోరు మోటారు మంజూరు చేశారు. ఇందులో భాగంగానే మండలంలోని మల్లికార్జున్‌పల్లిలో గల కొత్త కాలనీలో బోరు మోటారును ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో ప్రజలు నీటి కొరతతో ఇబ్బంది పడొద్దని బోరు వేయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ విఠల్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ మహేష్, మాజీ ఎంపీటీసీ యాదయ్య, నాయకులు పాల్గొన్నారు.

మీటింగ్‌కు వెళ్లొద్దంటూ బెదిరింపులు

రామచంద్రాపురం టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : సమావేశాలకు వెళ్లొద్దంటూ కార్యకర్తలను బెదిరింపులకు పాల్పడటం మంచిది కాదని బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శరెడ్డి అన్నారు. మంగళవారం రామచంద్రాపురం లక్ష్మీగార్డెన్స్‌లో వరంగల్‌లో 27న జరగనున్న రజతోత్సవ సభ సన్నాహక సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీఆర్ఎస్ బీఫాంపై గెలిచి మధ్యలోనే కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి వెళ్లిపోయిన సమయంలో పార్టీ పని అయిపోయిందంటూ ప్రచారం చేశారని తెలిపారు. తాము అదే సమయంలో మాజీ మంత్రి హరీశ్‌రావు నివాసానికి వెళ్లి తొమ్మిది మంది నాయకులతో మొత్తం పార్టీని నడిపిస్తామంటూ హామీ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సింధూ, మాజీ కార్పొరేటర్ అంజయ్యయాదవ్, తెల్లాపూర్ మాజీ సర్పంచ్ మల్లేపల్లి సోమిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా తుల్జాభవానీమాత ఉత్సవాలు

పుల్‌కల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దారెడ్డిపేట గ్రామంలో వెలసిన తుల్జాభవానీమాత 32వ జాతర మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. 25 వరకు ఉత్సవాలు జరగనున్నాయి. ఆలయ ధర్మకర్త నర్సమాంబమాత ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. సదాశివపేట పట్టణానికి చెందిన చిందికేరి సతీష్‌కుమార్ దంపతులు జలాభిషేకం అందించారు. కాగా గ్రామానికి చెందిన 250 మంది మహిళలు రాగి కలశాలతో మంజీరానదికి వెళ్లి జలాలు తీసుకొచ్చి జలాభిషేకం చేశారు. సంగారెడ్డి, రంగారెడ్డి, మెదక్ జిల్లాలతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు రానుండడంతో నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

మన్నె కుల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక



మన్నె కుల సంఘం నూతన కమిటీ

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో మన్నె కుల సంఘం జిల్లా కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడిగా జ్యానం, అధ్యక్షుడిగా నారాయణ, ప్రధాన కార్యదర్శిగా వెంకట్, సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా ఈశ్వర్, ఉపాధ్యక్షులుగా హరికృష్ణ, రాజేందర్, శివకుమార్, పవన్‌కుమార్, మల్లేష్, సహాయ కార్యదర్శులుగా దశరథ్, లక్ష్మయ్య, మోహన్, లక్ష్మణ్, కృష్ణ, గౌరవ సలహాదారులుగా నర్సింలు, నాగరత్నం, పాపారావు, యాదయ్య, బుచ్చయ్య, అశోక్, దేవేందర్, సత్యనారాయణ, శంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రైవేట్ బడి వద్దు.. సర్కారు బడి ముద్దు

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ బడి వద్దు సర్కారు బడి ముద్దు అని విద్యార్థులను సర్కారు బడిలోనే చేర్పించాలని మంగళవారం పలు గ్రామాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. చిన్నశంకరంపేట మండలంలోని చందాపూర్ గ్రామ ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయులు సర్కారు బడిలో విద్యార్థులను చేర్పించాలని ప్రచారం నర్వహించారు.

ఉద్యోగ విరమణ సహజం: జడ్పీ సీఈవో

నర్సాపూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఉద్యోగ విరమణ సహజమని జడ్పీ సీఈవో ఎల్లయ్య పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పెద్దచింతకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయురాలు రుక్మిణీ ఉద్యోగ విరమణ వీడ్కోలు సమావేశం నిర్వహించారు.ఎల్లయ్య, డీఆర్డీవో పీడీ శ్రీనివాస్‌రావు, జిల్లా నోడల్ అధికారి రాజిరెడ్డి హాజరై మాట్లాడారు.